క్లుప్తంగా

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని

చార్మినార్: ప్రభుత్వం అన్ని పండుగలను వైభవంగా నిర్వహిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కోట్ల అలీజాలోని కోట మైసమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడు రాయి కోటి బాబురాజా రూపొందించిన న్యూ ఇయర్ కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం అన్ని దేవాలయాలకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. యాదగిరియాదవ్, మధుసూదన్‌యాదవ్, శ్రీధర్ పాల్గొన్నారు.

అభినందనలు



అబిడ్స్: నూతన సీఎస్ శాంతికుమారికి హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేని అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ సాధన శాంతికుమారి ఆధ్వర్యంలో కొనసాగుతుందన్నారు. టీఎన్జీఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్, జిల్లా కార్యదర్శి విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో అభివృద్ధి



అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. అబిడ్స్ ట్రూప్‌బజార్, ఎంజేమార్కెట్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. జాంబాగ్ సుబాన్‌పురాలో త్వరలోనే బస్తీదవాఖానా ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో సురేష్, అహ్మద్, బాల్‌రాజ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

తెలుగుదనం ఉట్టిపడేలా..

తెలుగు లోగిళ్లలో సంక్రాంతి శోభ ఉట్టిపడుతోంది. ప్రతి వీధి పండుగ కళను సంతరించుకుంది. పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పాఠశాలలతో పాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సంబరాల్లో మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు. – అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



ముగ్గులు వేస్తున్న మహిళలు



జియాగూడ సరస్వతి విద్యానికేతన్ ఆధ్వర్యంలో..



శాంతినగర్ శ్లోకా స్కూల్ ఆధ్వర్యంలో..



ఇంద్రాని మహా విద్యాలయ స్కూల్ ఆధ్వర్యంలో..



విజయనగర్‌కాలనీ నారాయణ పాఠశాలలో..



టోలిచౌకి రవీంద్రభారతి పాఠశాలలో..

రాజస్థానీల స్పెషల్.. గేవరీ



గేవరీలను తయారు చేస్తున్న దృశ్యం

జియాగూడ: సంక్రాంతి పండుగను రాజస్థానీలు ప్రత్యేక శైలిలో నిర్వహిస్తారు. పండుగ రెండు రోజుల పాటు తియ్యటి గేవరీలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుని శుభాకాంక్షలు చెప్పుకుంటారు. రాజస్థానీలు అధికంగా ఉండే బేగంబజార్ ప్రాంతంలో గేవరీ ఐటమ్ స్పెషల్. వీటిని నెయ్యి, డాల్డా, చక్కెర, పాలు, మైదా, కోవా, డ్రైఫ్రూట్స్‌తో తయారు చేస్తారు. బేగంబజార్, ఛత్రి, సిద్దిఅంబర్‌బజార్, అశోక్‌బజార్, చుడిబజార్, స్వస్తిక్, బర్తన్‌బజార్, ఫీల్‌ఖానా ప్రాంతాల్లో రాజస్థానీలు తీపి గేవరీలను తప్పకుండా కొనుగోలు చేస్తారు. బేగంబజార్ మహేశ్వరి భవన్, ఫీల్‌ఖానా ప్రాంతాల్లో వీటిని తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటి ధర కేజీ రూ.200 నుంచి రూ.400 వరకు ఉంటుంది.



అమ్మకానికి రెడీగా ఉన్న గేవరీలు

కార్పొరేటర్ మృతి కలచివేసింది

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కరుణాకర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ మృతి తననెంతో కలచివేసిందని, ఆయనతో తనకు ఆత్మీయ బంధం ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆయన మరణవార్త తెలుసుకున్న మంత్రి గుడిమల్కాపూర్‌లో కార్పొరేటర్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యకర్తల్లో ఎప్పుడూ నూతన ఉత్సాహం నింపే నాయకుడి మరణాన్ని తాను జీర్ణించుకోలేకపోతున్నానని ఆయన అన్నారు. ఆయన వెంట బీజేపీ సీనియర్ నేత చింతల రాంచంద్రారెడ్డి ఉన్నారు.

బండారు దత్తాత్రేయ సంతాపం..

కార్పొరేటర్ మృతిపట్ల హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన హర్యానా రాజ్‌భవన్ నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కరుణాకర్ పేదల కోసం అంకిత భావంతో పనిచేస్తూ నిస్వార్థమైన సేవలందించారని పేర్కొన్నారు.

మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ నివాళి..

కార్పొరేటర్ మృతిపట్ల నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, కమిషనర్ లోకేశ్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త తెలియగానే మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సిటీ న్యూరో ఆస్పత్రికి వెళ్లి నివాళులర్పించారు. రెండు సార్లు కార్పొరేటర్‌గా ఎన్నికైన కరుణాకర్‌కు ప్రజాబలం మెండుగా ఉందని, ఆయన మృతి బాధాకరమని ఆమె అన్నారు.

నేత్రదానం..

గోల్కొండ: కార్పొరేటర్ కరుణాకర్ నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. బతికుండగానే తన నేత్రాలు దానం చేయాలని ఆయన చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయాన్ని వైద్యులకు చెప్పడంతో సిటీ న్యూరో వైద్యులు ఆయన నేత్రాలను తీసుకున్నారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: ద్విచక్ర వాహనాల డిక్కీలలో ఉండే వస్తువులను చోరీ చేస్తున్న నిందితుడిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ చక్రవర్తి తెలిపిన వివరాల మేరకు.. మోయిన్‌బాగ్‌కు చెందిన సయ్యద్ వసీం అలియాస్ రైడర్ వసీం(24) తాళం వేసి ఉన్న ద్విచక్రవాహనాల డిక్కీలలో ఆభరణాలు చోరీ చేస్తున్నాడు. చాంద్రాయణగుట్ట, భవానీనగర్, బాలాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో తొమ్మిది చోరీలకు పాల్పడ్డాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద ఉన్న 124 గ్రాముల బంగారు ఆభరణాలు, 15 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

అభివృద్ధి విషయంలో వివక్ష చూపం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఎలాంటి వివక్ష లేకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకి డివిజన్‌లోని జమాలికుంటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నదీమ్‌కాలనీ ముంపు సమస్య పరిష్కరించేందుకు కొత్త డ్రైనేజీ లైన్లు వేశామన్నారు. ఇప్పటికే టోలిచౌకి నిజాంకాలనీలో బాక్స్ డ్రైన్ పనులు పూర్తయ్యాయన్నారు. శాతం చెరువు నీరు నదీమ్‌కాలనీలోకి రాకుండా చెరువుకు అదనపు తూము ఏర్పాటు చేశామన్నారు. బుల్కాపూర్ నాలాను రేతిబౌలిగుండా మళ్లించి అహ్మద్‌నగర్ నాలాలో కలిపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. హకీంపేట్ మిలటరీ ఏరియాలోని నాలాపై ఉన్న వంతెనను తొలగించేందుకు మిలటరీ అధికారులు ఒప్పుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయండి

యాకుత్‌పురా: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సంతోష్‌నగర్ డీసీ అలివేలు మంగతాయారు, డబీర్‌పురా క్లస్టర్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ అంజిలా అల్ఫ్రెడ్‌తో కలిసి కంటి వెలుగు కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సంతోష్‌నగర్ డీసీ అలివేలు మంగతాయారు మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు 11 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఆర్టీ కాలనీ, యాకుత్‌పురా అష్రపూల్ మదారీస్, ఖాన్‌నగర్ కమ్యూనిటీహాల్, తలాబ్‌కట్టా మోడల్ మార్కెట్, గౌలిపురా మిత్ర క్లబ్, కుమ్మరివాడీ కమ్యూనిటీహాల్, పటేల్‌నగర్ కమ్యూనిటీహాల్, ఓంనగర్ కమ్యూనిటీహాల్, ఇండియన్ ఫంక్షన్‌హాల్, సుబ్రమణ్యం కాలనీ పార్కు, ఖాలేందర్‌నగర్ కమ్యూనిటీహాల్ ప్రాంతాల్లో కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

'మాజీ సైనికులకు ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయిస్తుంది'

సుల్తాన్‌బజార్: దేశానికి సేవలు అందించి పదవీ విరమణ పొందిన మాజీ సైనికులకు ఇంటి స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుందని రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అమ్మిక రంగయ్యగౌడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హిమాయత్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. మాజీ సైనికుల కుటుంబాలకు 250 గజాల స్థలం కేటాయించాలని కోరుతూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, మండల రెవిన్యూ అధికారులకు లేఖ రాశామని, ప్రభుత్వం స్పందించి జవహర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసి నివేదిక అందజేయాలని కీసర ఆర్డీఓ, కాప్రా తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇంటి స్థలం కోసం రిజిస్టర్ చేసుకున్న జంట నగరాల్లో ఉన్న మాజీ సైనికులు అల్వాల్‌లో ఉన్న తమ సంఘం కార్యాలయానికి వచ్చి పేర్లు పరిశీలించుకోవాలని సూచించారు. కొత్తగా రిటైర్డ్ అయిన సైనికులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకునే అవకాశం ఉందన్నారు. పూర్తి సమాచారం కోసం 9346227672 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రక్తదాన శిబిరం

అబిడ్స్: రక్తదానం ప్రాణదానంతో సమానమని శంకరయ్య సేవా సమితి అధ్యక్షుడు ఎస్.మధుసూదన్‌రావు అన్నారు. న్యూ ఉస్మాన్‌గంజ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్‌యాదవ్, చేగూరి యశ్వంత్ పాల్గొన్నారు.